

క్షణం..ఆలోచించు !
చదువు ఒత్తిడి, తోటి విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఏదో అన్నారని క్షణికావేశంలో విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడుతూ కన్నవారికి తీరని విషాదాన్ని మిగుల్చుతున్నారు. 8లో▸



ప్రశాంతంగా సీవోఈ సెట్
ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయా ల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎ క్సలెన్సీ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివా రం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.3 /20.1

ఉష్ణోగ్రతలు సాధారణం కన్నా ఎక్కువగా నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ తీవ్రత అధికంగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. చలి ప్రభావం పూర్తిగా తగ్గుతుంది.

న్యూస్‌రీల్

మహిళా సాధికారతపై కవి సమ్మేళనం



సుబ్బాయమ్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే

మంచిర్యాలఅర్బన్: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని స్థానిక సరస్వతి శిశుమందిర్‌లో సాహితీ సంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆదివారం మహిళా సాధికారితపై కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షురాలు ఐవీ.సుబ్బాయమ్మ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దివాకర్‌రావు హాజరయ్యారు. నీలాదేవి, పోటు హైమావతి మహిళా సాధికారతపై ప్రసంగం చేశారు. మహిళా సాధికారత కవితాంశంపై కవయిత్రులు భారతిమూర్తి, షేర్, నీలాదేవి, సునీత, వసంత, పట్వర్ధన్, నిర్మద, వసంతతో పాటు పలువురు తమ కవితలతో ఆకట్టుకున్నారు.

నేడు పర్యావరణ విద్య పరీక్ష
మంచిర్యాలఅర్బన్: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు సోమవారం పర్యావరణ విద్య పరీక్ష నిర్వహిస్తున్నట్లు డీఐఈవో శైలజ తెలిపారు. ఈపరీక్షలో ఫెయిల్ అయినా, గైర్హాజర్ అయినా ఇంటర్మీడియట్ ఫెయిల్‌గానే పరిగణిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు తప్పనిసరిగా పరీక్షలు రాయాలని సూచించారు.

విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు



బహుమతులు అందిస్తున్న జేసీఐ సభ్యులు

శ్రీరాంపూర్: జూనియర్ చాంబర్ ఆఫ్ ఇంటర్నేషనల్(జేసీఐ) ఆధ్వర్యంలో నస్పూర్ కాలనీలోని శ్రీరామచంద్ర మిషన్‌లో జిల్లాస్థాయి డ్రాయింగ్ పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ న్యాయవాది కేవీ.ప్రతాప్, జీఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజారమేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ఉత్సాహంగా డ్రాయింగ్ పోటీల్లో పాల్గొన్నారు. ఒకటి నుంచి 3వ తరగతి విభాగంలో శ్రీలౌక్య(ప్రథమ), బి.సర్గీ(ద్వితీయ), జి.భవ్య (తృతీయ), నాలుగు నుంచి ఆరో తరగతి వరకు అక్షయ(ప్రథమ), కె.లోహిత్(ద్వితీయ), ఆశ్విత(తృతీయ), ఏడు నుంచి 9వ తరగతి వరకు హన్మయి(ప్రథమ), జవేర్నియా(ద్వితీయ), అదీప్(తృతీయ) స్థానం సాధించారు. వీరికి అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో జేసీఐ జిల్లా అధ్యక్షుడు ఆరుముళ్ల రాజు, ఆకనపల్లి సురేశ్, గస్‌రాజ్, వెంకటేశ్, చైతన్య, జీఏ.వెంకటేశ్వర్లు, లత, మహేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రక్షణలో సాంకేతిక పద్ధతులు అవలంబించాలి



మాట్లాడుతున్న సంజీవరెడ్డి

శ్రీరాంపూర్: గనుల్లో రక్షణ చర్యలు పెంచడంలో నూతన సాంకేతిక పద్ధతులు అవలంబించాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. సీసీసీలోని ఎస్సీవోఏ క్లబ్‌లో ఆర్కే5 గని అధికారులు, సూపర్‌వైజర్లతో రక్షణ, ఉత్పత్తి, ఉత్పాదకతపై ఆదివారం సమీక్ష నిర్వహించారు. ఆర్కే–5 గని నెల ముందుగానే వార్షిక ఉత్పత్తిని సాధించిందన్నారు. రక్షణ పరంగా కూడా అనేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. సింగరేణి వ్యాప్తంగా ఆర్కే–5, ఆర్కే–6 గనులు ఇప్పటికే వంద శాతం ఉత్పత్తిని సాధించి అన్నింటి కంటే ముందున్నాయన్నారు. ఏజెంట్ ఏవీ.రెడ్డి, ఆర్కే–5 గని మేనేజర్ అబ్దుల్‌ఖాదిర్, ఆర్కే–6 గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి శివయ్య, ఇంజినీర్ వీరన్న పాల్గొన్నారు.

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలో ఓ మైనర్ బాలిక పుస్తకాల కోసం షాప్‌కు వెళ్తుండగా ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో పనిచేసే బాలుడు(మైనర్) వెంటపడి, బాలికకు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకెళ్లాడు. లైంగిక దాడిచేశాడు. అనంతరం బాధితురాలు ఇంటికి వచ్చి విషయం చెప్పింది. వెంటనే తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

నీల్వాయికి చెందిన బాలికను చెన్నూర్‌కు చెందిన ప్రసాద్ ప్రేమిస్తున్నానని వెంటపడ్డాడు. మాయమాటలతో లొంగదీసుకున్నాడు. ప్రసాద్‌కు సోదరుడి వరుసైన సంతోష్ ఇంటికి తీసుకెళ్లి లైంగికదాడి చేశాడు. దీంతో సదరు బాలిక గర్భందాల్చింది. ప్రసాద్, సంతోష్, మరో సోదరుడు ప్రశాంత్ ఆమెను ఆసుపత్రికి తీసుకెళ్లి అబార్షన్ చేయించుకోవాలని ఒత్తిడి తెచ్చారు. బాలిక నిరాకరించడంతో బలవంతగా అబార్షన్ మాత్రలు మింగించారు. బాలిక ఓ రోజు కడుపునొప్పితో బాధపడడంతో తల్లిదండ్రులు ఆరా తీశారు. దీంతో విషయం బయటకు వచ్చింది. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు.

షీ టీమ్స్ ఎక్కడ..?

- సిబ్బంది కొరతతో కనిపించని వైనం
- కానరాని అవగాహన సదస్సులు
- మహిళలపై పెరుగుతున్న దాడులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో మహిళలకు రక్షణ కరువైంది. మూడుముళ్లు.. ఏడడుగులు.. వేద మంత్రాలు.. అగ్ని సాక్షిగా మనువాడిన భర్త అయినా.. తోటి ఉద్యోగి అయినా.. విద్యాబుద్ధులు చెప్పే గురువైనా.. ప్రేమ పేరిట నయవంచన చేసే మృగాళ్లయినా.. బలయ్యేది మాత్రం మహిళనే. మనకు జన్మనిచ్చిన అమ్మ... తోడ బుట్టిన చెల్లి.. కట్టుకున్న భార్య మహిళనే అయినా.. మన వారు కానివారిపై వేధింపులు ఆగడం లేదు.. 'ఆమె' జిల్లాలో నిత్యం ఎక్కడో ఒక చోట వేధింపులకు గురవుతూనే ఉంది. ఎన్ని చట్టాలు వచ్చినా వేధింపులు ఆగడం లేదు. యువతులు, మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసిన షీటీమ్స్ జిల్లాలో మచ్చుకైనా కనిపించడం లేదు.

మహిళల రక్షణకు షీ టీమ్స్..

మహిళల రక్షణ కోసం పోలీస్ శాఖ 2015, అక్టోబర్ 31న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో షీ టీమ్స్ ఏర్పాటు చేశారు. ప్రారంభంలో హడావుడి చేసిన షీటీమ్స్ ప్రస్తుతం ఎక్కడా పని చేయడం లేదు. మహిళల రక్షణపై అవగాహన సదస్సులు కూడా నిర్వహించడం లేదు. కొన్నాళ్లు కళాశాలలు, బస్టాండ్, రైల్వే స్టేషన్ల వద్ద పబ్లిక్ ప్లేస్‌లలో షీ టీమ్ బృందాలు మఫ్టీలో ఉంటూ స్పై కెమెరాలతో ఘటనను చిత్రీకరించేవారు. జిల్లాలోని మూడు పోలీస్ సబ్ డివిజన్లు ఉండగా, డివిజన్‌కు ఒక ఎస్సైని షీ టీమ్ ఇన్‌చార్జిగా నియమించారు. అయితే సిబ్బంది కొరతతో ఈ షీటీమ్స్ మూణ్నాళ్ల ముచ్చటగానే మారాయి.



షీ టీమ్ కార్యకలాపాలపై అవగాహన కల్పిస్తున్న షీ టీమ్ ఇన్‌చార్జి, ఎస్సై మమత (ఫైల్)

పెరుగుతున్న వేధింపులు..
జిల్లాలో షీ టీమ్స్ కార్యకలాపాలు తగ్గడంతో యువతులు, మహిళలపై వేధింపులు పెరుగుతున్నాయి. వీటిలో కొన్ని వెలుగులోకి వస్తుండగా.. చాలా ఘటనలు ఇతర కేసుల విచారణ సమయంలోనో.. లేక బాధితులు అనారోగ్యానికి గురైనప్పుడో బయట పడుతున్నాయి. పరువు పోతుందని కొందరు తల్లిదండ్రులు ఇలాంటి సంఘట నలు చెప్పడం లేదు. నిందితులు తెలిసినవారై ఉండటం కూడా పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు.

SHE TEAMS
TELANGANA POLICE

యువతులు, మహిళలను వేధిస్తే పడే శిక్షలు..

చదువుకుంటున్న విద్యార్థినులు, యువతులు, మహిళలను వేధిస్తే చట్టపరంగా కఠిన శిక్ష విధిస్తారు. విద్యార్థినులను వేధిస్తే నిందితులను విద్యాలయాల నుంచి తాత్కాలికంగా లేదా శాశ్వతంగా తొలగిస్తారు. మరే విద్యాలయంలో ప్రవేశాలు లేకుండా చేసే అవకాశం కూడా ఉంది. ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత లేకుండా చేయడం, పాస్‌పోర్టు జారీచేయకుండా చర్యలు తీసుకోవచ్చు, యూజీసీ విధానాల ప్రకారం ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే ఉపకారవేతనాలు నిలిపివేయడం, పోటీపరీక్షలకు హాజరుకాకుండా చేయడం, ఫలితాలు నిలిపివేత, రూ.2.50 లక్షల వరకు జరిమానా విధించవచ్చు.

మైనర్లను వేధిస్తే..

మైనర్ బాలికలను వేధించినా, లైంగిక దాడికి యత్నించినా, దాడి చేసినా అది అత్యాచారంగానే పరిగణించబడుతుంది. పిల్లలపై లైంగిక దాడిచేస్తే ఏడేళ్లకు తగ్గకుండా జైలు శిక్ష, జరిమానా, లేద జీవిత ఖైదు విధించవచ్చు. పిల్లలపై అత్యాచారం లేదా వేధింపులకు గురిచేస్తే 3 నుంచి 5 ఏళ్ల జైలు శిక్ష, జరిమానా, రెండోసారి అదే నేరం చేస్తే ఏడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉంది. ఈ చట్టాలపై అవగాహన కల్పించే వారు లేకపోవడంతో చట్టాలు తెలియక నేరస్తులపై ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. అవగాహన కల్పించాల్సి న షీటీమ్స్ ఈ ఏడాది ఇప్పటి వరకు ఒక్క అవగాహన సదస్సు కూడా ఏర్పాటు చేయలేదు.

గడిచిన నాలుగేళ్లలో జిల్లాలో నమోదైన కేసుల వివరాలు...

కేసులు	2019	2020	2021	2022
అత్యాచారం	34	34	33	53
వేధింపులు	480	400	348	540
ఈవ్‌టీజింగ్	47	56	33	228
పోక్సో	55	65	36	19

మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి..



మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిపెట్టాం. వారికోసం ప్రత్యేకంగా షీటీమ్స్‌ని ఏర్పాటు చేశాం. అయితే సిబ్బంది కొరతతో షీటీమ్స్ కార్యకలాపాలకు అంతరాయం కలిగింది. కొందరు సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నారు. పరీక్షలు కాగానే షీటీమ్స్‌ను బలోపేతం చేస్తాం. తల్లి దండ్రులు వారి పిల్లలను ఎప్పటికప్పుడు గ మనిస్తుండాలి. స్నేహితుల వివరాలు తల్లిదండ్రులకు తెలిసి ఉండాలి. సమాజంలో జరుగుతున్న విషయాలపై అవగాహన కల్పించాలి. యువతులు, మహిళలు ఎవరైనా వేధించినా, ఇబ్బందులకు గురిచేసినా డయల్ 100 లేదా వాట్సాప్ నంబర్ 6303923700కు సమాచారం ఇవ్వాలి.

– రెమారాజేశ్వరి, రామగుండం పోలీస్ కమిషనర్

సైక్లింగ్‌తో ఆరోగ్యం

- జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి



సైక్లింగ్‌ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యల

మంచిర్యాలటౌన్: ప్రతీరోజు సైక్లింగ్ చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉంటామని, శరీరంలోని కేలరీ లు ఖర్చవుతాయని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంచిర్యాలలో ఆదివారం సైక్లింగ్‌పై మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీ చైర్‌పర్సన్ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడా రు. శారీరక శ్రమ పెరగడం వల్ల అసంక్రమణ వ్యా ధులకు దూరంగా ఉంటామన్నారు. వ్యాయామంతో శ్వాసక్రియ మెరుగుపడుతుందని, గుండె సంబంధిత వ్యాధులు దూరం అవుతాయని పేర్కొన్నా రు. శారీరక, మానసిక ధృఢత్వం, రోగనిరోధక శక్తి పెరుగుతాయని తెలిపారు. ప్రతీరోజు సైక్లింగ్‌తోపా టు, ఇతర వ్యాయామం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, అ దనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రెనీ కలెక్టర్ గౌతమి, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదేలు, మున్సి పల్ చైర్మన్ పెంట రాజయ్య, జిల్లా వైద్యాధికారి సుబ్బరాయుడు, డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ విజయనిర్మల, డాక్టర్ విజయపూర్ణిమ, ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అనిత, డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డెమో బుక్కా వెంకటేశ్వర్, సీహెచ్‌వో మూర్తి, హెచ్‌ఈవో నాందేవ్, సఖి ఇన్‌చార్జి శ్రీలత పాల్గొన్నారు.



సైక్లింగ్ చేస్తున్న అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ట్రైనీ కలెక్టర్ గౌతమి

బిగుస్తున్న ఉచ్చు!



కబ్జాకు గురైనట్లు ఆరోపణలు వస్తున్న చెరువు

- సీలింగ్ భూమి పట్టాపై ఎమ్మెల్యే ఆగ్రహం
- విచారణ చేపట్టాలని తహసీల్దార్‌కు ఆదేశం
- నిజమని తేలితే క్రిమినల్ కేసు పెట్టాలని సూచన

జన్నారం: సీలింగ్ భూమి అక్రమంగా పట్టా చేసుకున్న వారికి ఉచ్చు బిగుస్తోంది. శిఖం భూమిని సీలింగ్‌గా మార్చి అక్రమంగా పట్టా చేసుకున్న అధికార బీఆర్ఎస్‌కు చెందిన ఇద్దరు నాయకులపై ఖానాపూర్ ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమ పట్టాపై విచారణ చేయాలని తహసీల్దార్ వెంకటకిషన్‌ను ఆదేశించారు. పట్టా చేసుకున్న భూములు ఉన్న రెండు సర్వే నంబర్లను బ్లాక్‌లో పెట్టాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నారు. జన్నారం మండలం తపాలపూర్ గ్రామానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు సింగరాయిపేట చెరువు శిఖం భుమిని సీలింగ్ భుమిగా మార్చి అక్రమంగా వారి కుమారుల పేర్లపై పట్టా చేయించారు. ఈ భూమిపై సదరు నాయకులు బ్యాంకులో రుణం కూడా తీసుకున్నారు. ఈ విషయాన్ని గ్రామానికి చెందిన మరి కొందరు నాయకులు బయటకు తీయడంతో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ క్రమంలో 'సీలింగ్ భూమి అక్రమ పట్టా' అనే శీర్షికన ఈనెల 4న 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఈ విషయాన్ని బీజేపీ నాయకుడు కొండపల్లి మహేశ్, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే ప్రమేయంతోనే అక్రమంగా పట్టా చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నట్లు తెలియజేశారు. స్పందించిన ఎమ్మెల్యే సదరు ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్నారం తహసీల్దార్ వెంకట కిషన్‌తో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సదరు సర్వే నంబర్లు 147/11, 147/6లో అక్రమ పట్టాలపై విచారణకు ఆదేశించారు.

సస్పెండ్ చేసే అవకాశం
అధికార పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యే అండదండలతోనే అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలు వస్తున్న దృష్ట్యా ఈ విషయంలో రేఖానాయక్ సీరియస్‌గా ఉన్నారు. అధికారుల విచారణ అనంతరం నిజమని తేలితే సదరు ప్రజాప్రతినిధులను పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశం ఉందని సమాచారం. తప్పు చేయకపోతే ప్రెస్‌మీట్ పెట్టి చెప్పాలని ఆదేశించినట్లు తెలిసింది. సదరు ప్రజాప్రతినిధులు ఏం చేయాలో తెలియక సందిగ్ధంలో పడ్డారు.

కిష్టాపూర్ చెరువూ ఆక్రమణ..
సింగరాయిపేట చెరువు బాగోతం బయటకు రాగానే, కిష్టాపూర్ చెరువు కూడా ఆక్రమణ గురైనట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామానికి చెందిన కొందరు అధికార పార్టీ నాయకులు చెరువు భూమిని కబ్జా చేసినట్లు ఆరోపిస్తున్నారు. రెవెన్యూ అధికారులు విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని కూడా ఎమ్మెల్యే రేఖానాయక్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే కిష్టాపూర్ చెరువు విషయంలో కూడా విచారణ జరిపి వివరాలను తెలియజేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

ఎవరినీ ఉపేక్షించం
చెరువుల పునరుద్ధరణ, ఆధునికీకరణ కోసం ప్రభుత్వం మిషన్ కాకతీయ ద్వారా కోట్ల రుపాయలు ఖర్చు చేసింది. ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా, చెరువు భూములను ఆక్రమించినా ఉపేక్షించేది లేదు. అధికార పార్టీ నాయకులైనా, ఇతర పార్టీల నాయకులైనా అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ కేసులు పెట్టిస్తాం. సింగరాయిపేట్ చెరువు భూమి అక్రమ పట్టా విషయంలో నా ప్రమేయం లేదు. ఈ విషయంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆదేశించాను. కలెక్టర్, ఆర్డీవో దృష్టికి కూడా తీసుకెళ్తా.

– అజ్మీరా రేఖానాయక్, ఎమ్మెల్యే ఖానాపూర్

నిజమని తేలితే క్రిమినల్ కేసులు..
సింగరాయిపేట్ గ్రామ శివారులో చెరువు భూమి అక్రమ పట్టా విషయంపై విచారణలో నిజమని తేలితే క్రిమినల్ కేసులు పెట్టాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అధికార పార్టీ నాయకులైనా, ఇతర పార్టీ నాయకులైనా అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించొద్దని స్పష్టం చేశారు. తహసీల్దార్ వెంకట కిషన్ ఆన్‌లైన్‌లో రికార్డులు తీసి ఉన్నతాధికారులకు పంపించారు. ఈ మేరకు ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా చెరువు భూముల హద్దులను గుర్తించనున్నట్లు తెలిసింది.

చట్టాలను సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా అదనపు జడ్జి మైత్రేయి



మాట్లాడుతున్న అదనపు జడ్జి మైత్రేయి

శ్రీరాంపూర్: మహిళల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని అదనపు జడ్జి జె.మైత్రేయి సూచించారు. ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జిల్లా న్యాయ సేవా సంస్థ, నేషనల్ ఉమెన్స్ కమిషన్ ఆధ్వర్యంలో మహిళా సాధికారత, చట్టా లపై నస్పూర్–శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవా సంస్థ చైర్మన్ బి.సత్తయ్య ఆదేశాల మేరకు నిర్వహించిన సదస్సుకు ముఖ్య అతిథిగా అదనపు జడ్జి హాజరై మాట్లాడారు. అన్నింటికీ స్త్రీనే పునాది అన్నారు. ఆమె లేనిదే కుటుంబం లేదని, సమాజం కూడా లేదన్నారు. స్త్రీని గౌరవిస్తే దేవున్ని పూజించినట్లే అని తెలిపారు. ఇటీవల చిన్న పిల్లలపై అఘాత్యాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. 18 ఏళ్లలోపు పిల్లలపై జరిగే అరాచకాలపై పోక్సో చట్టం ఉందన్నారు. పిల్లలపై లైగింక వేధింపులు కూడా రేప్ కిందికే వస్తుందన్నారు. ఈ కేసులో బాధితుల వివరాలు, వారి గుర్తింపు పూర్తి గోప్యంగా ఉంచుతామన్నారు. ఈ చట్టం కింద కేసులు నమోదైతే శిక్షలు తీవ్రంగా ఉంటాయన్నారు. ఇటీవల సెల్‌ఫోన్ల ద్వారా వేధింపులపై కూడా అనేక కేసులు నమోదు అవుతున్నాయన్నారు. అమ్మాయిల ఫొటోలు మార్ఫింగ్ చేసి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. అనంతరం అదనపు సీనియర్ సివిల్ జడ్జి అర్పిత మారంరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలకు విలువలు నేర్పించాలని సూచించారు. ఎదుటి వారిని ఎలా గౌరవించాలో చిన్నప్పటి నుంచే నేర్పించాలన్నారు. పెళ్లయిన కొంత కాలానికే చిన్న విషయాలకే విడాకులకు వెళ్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాభర్తలు ఎవరికి వారే తమ పొరపాట్లను గుర్తించి సరి చేసుకుంటే వారి దాంపత్యం బాగుంటుందన్నారు. వరకట్నం వేధింపులు, గృహ హింస వంటి చట్టాలు ఏం చెబుతున్నాయి, ఎలా జీవితంలో మెలగాలో అవగా హన కల్పించారు. అంతకు ముందు జిల్లా న్యాయ సేవా సంస్థ సెక్రెటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఉదయ్‌కుమార్ మాట్లాడుతూ న్యాయ సేవా సంస్థ పేదలకు కోర్టులో న్యాయ సహాయం చేస్తుందన్నారు. వారికి కొన్ని కోర్టు ఫీజులు కూడా చెల్లిస్తుందని, లోక్ అదాలత్‌లు నిర్వహించి కేసులను రాజీ మార్గంలో పరిష్కరించడానికి కృషి చేస్తుందని వివరించారు. చట్టాలపై అవగాహన, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడం కూడా చేస్తుందని తెలిపారు. మహిళా సాధికారికత సాధించడం కోసం ఈ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా స్థానిక మ హిళలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినందుకు ముఖ్య అతిథులను శాలువాలతో సత్కరించారు. సీడీపీవో స్వరూపారాణి, రిసోర్స్ పర్సన్ ప్రభందిత, సఖి సంస్థ నిర్వాహకులు విజయ, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ భుజంగరావు, ఈసీ సభ్యుడు అనిల్‌రాజు, న్యా యవాదులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అలరించిన 'ఊరు మనదిరా'



బెల్లంపల్లి ఏఎంసీ క్రీడా మైదానంలో ఆదిలాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రజా కవి గూడ అంజయ్య యాదిలో నిర్వహించిన ఊరు మనదిరా సాంస్కృతిక సభ అలరించింది.

- వివరాలు 8లో▸

ప్రొటోకాల్ అడిగితే దౌర్జన్యం చేస్తారా?

- బీఆర్ఎస్ నేతల తీరుపై కాంగ్రెస్ నాయకుల ఆగ్రహం

మంచిర్యాలటౌన్: ప్రోటోకాల్ పాటించమని అడిగితే అధికార బీఆర్ఎస్ నాయకులు గూండాయిజం చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. బీఆర్ఎస్ తరపున కౌన్సిలర్‌గా పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తితో అధికారిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్ తెలిపారు. జిల్లా కేంద్రంలో ఆదివారం మాట్లాడారు. కొబ్బరికాయలు కొట్టే ఎమ్మెల్యేగా మాత్రమే దివాకర్‌రావు పేరు తెచ్చుకుంటున్నారని విమర్శించారు. ప్రారంభించిన అభివృద్ధి పనులు పూర్తి చేయడంలోనూ ఎమ్మెల్యే విఫలమయ్యారని పేర్కొన్నారు. మున్సిపల్ నిధులతో ప్రారంభించే పనులను ఎమ్మెల్యే ఫండ్ పేరు చెప్పి ఇష్టమొచ్చిన వారితో అధికారిక కార్యక్రమాలు చేయించి ప్రజల్లో చులకన అవుతున్నారని అన్నారు. గొడవలకు ముందుకు వస్తే చూస్తూ ఊరుకోమని, కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు ఒక్కసారి మీదకు వస్తే బీఆర్ఎస్ నాయకులు తట్టుకోలేరని హెచ్చరించారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యే టికెట్ ఇతరులకు ఇస్తున్నారని తెలిసి, ఎమ్మెల్యే, అతని తనయుకు మతిభ్రమించి ఇష్టారీతిన ప్రవర్తిస్తున్నారని ఎద్దేవా చేశారు. పార్టీలో ఏ పదవి లేకుండా, కనీసం ప్రజాప్రతినిధి కాని వారితో ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో చేపట్టే పనులను ప్రారంభిస్తుంటే ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు. ప్రోటోకాల్ లేకుండా వ్యవహరించి, అవమానపరిచేలా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. గుండాగిరి చేసే సంస్కృతి బీఆర్ఎస్ నాయకులదేనని అన్నారు. మిషన్ భగీరథ పనులను ప్రారంభించేందుకు వందలాది కొబ్బరికాయలను కొట్టినా, ఇప్పటి వరకు పనులు ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నియోజకవర్గం అధ్యక్షుడు సల్ల మహేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజిద్, నాయకులు కొండ చంద్రశేఖర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ అధ్యక్షురాలు గజ్జెల హేమలత తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్

క్లుప్తంగా

కారు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ వద్ద ఆదివారం కారు, బైక్ ఢీకొన్న ఘటనలో ధర్మ రావుపేట, ద్వారక గ్రామాలకు చెందిన చిరంజీవి, వెంకటేశ్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరు బైక్‌పై వెళ్తుండగా కారు ఢీకొంది. గాయాలైన వారిని స్థానికులు అంబులెన్స్‌లో లక్సెట్టిపేట ఆసుపత్రికి తరలించారు.

అంతర్జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు తనీశ్



తనీశ్‌ను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

ఆసిఫాబాద్: అంతర్జాతీయ సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన మండలంలోని తుంపెల్లికి చెందిన రేకల తనీశ్‌ను బీఆర్‌ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు జిల్లా కేంద్రంలోని తన నివాసంలో ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ఆదివారం సన్మానించారు. తనీశ్ వచ్చేనెల 20న భూటాన్‌లో జరిగే అంతర్జాతీయ సాఫ్టబేస్‌బాల్ పోటీలకు భారత్ తరఫున పాల్గొంటారు. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో విజయం సాధించి, దేశానికి పేరుతేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తనీశ్‌ను అభినందించారు. క్రీడాకారుడి తండ్రి రేకల తిరుపతి, సుదర్శన్, దత్తు, ఆత్మకూరి తిరుపతి, తుక్కిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి జన్మదిన వేడుకలు



శతాధిక వృద్ధురాలితో కుమారులు, కుమార్తెలు, కోడళ్లు



బుచ్చమ్మ

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల జిల్లా హాజీపూర్ మండలం ముల్కల్ల గ్రామానికి చెందిన పత్తిపాక బుచ్చమ్మ (105) జన్మదిన వేడుకలు ఆది వారం ఘనంగా నిర్వహించారు. బుచ్చమ్మ–వెంకటి దంపతులకు నలుగురు కుమారులు, ఇద్దరు కు మార్తెలు సంతానం. 26 ఏళ్ల క్రితం వెంకటి మృతి చెందాడు. కొడుకులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు, ముని మనుమలు, మనుమరాళ్లు కలిపి మొత్తం 71 మంది ఉన్నారు. బుచ్చమ్మ 105వ పుట్టినరోజు వేడుకలను ఘన ంగా నిర్వహించారు. కుటుంబ సభ్యులు ఆటాపాటలతో సరదాగా గడిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



రాందాస్ (ఫైల్)

కెరమెరి (ఆసిఫాబాద్): మండలంలోని బారేమోడి గ్రామానికి చెందిన యువకుడు మొహర్లే రాందాస్(22) ఆదివారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై నల్లా వెంకటేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. బారేమోడికు చెందిన మొహర్లే శంకర్, కమలాబాయిలకు ముగ్గురు కుమారులు. వారిలో చిన్నవాడైన రాందాస్ కెరమెరి నుంచి బారేమోడికి బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో స్టార్ ఫంక్షన్ హాల్ సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆయన తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు అతన్ని కెరమెరి ప్రభుత్వ ఆస్పత్రి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. తల్లి కమలాబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



కాలిపోతున్న ఇల్లు

బోథ్: మండల కేంద్రంలోని న్యూకాలనీలో రాథోడ్ సూర్యకళకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు దగ్ధమైంది. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో మంటలు అంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలార్పే ప్రయత్నం చేశారు. అంతలోపు ఇంట్లో ఉన్న వస్తువులు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. బీరువాలో ఉన్న నగదు, బట్టలు పూర్తిగా కాలిపోయాయి. దాదాపు రూ.3 లక్షల వరకు ఆస్తినష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరింది. మండలంలో అగ్ని ప్రమాదం జరిగితే ఫైరింజన్ లేదని, ప్రజాప్రతినిధులు కల్పించుకుని బోథ్‌లో ఫైర్‌స్టేషన్ మంజూరు చేయాలని కోరుతున్నారు.

క్షణం.. ఆలోచించు !



- విద్యార్థులపై పెరుగుతున్న మానసిక ఒత్తిడి
- క్షణికావేశం.. బలవన్మరణాలతో తీరని విషాదం
- తల్లిదండ్రులు పిల్లలపై ఒత్తిడిని దూరం చేయాలి
- మానసిక ధైర్యం అవసరమంటున్న నిపుణులు

మంచిర్యాలఅర్బన్/నేరడిగొండ: చదువు విషయంలో ఒత్తిడి, తోటి విద్యార్థులు ఏదో అన్నారని క్షణికావేశంలో బలవన్మరణాలకు పాల్పడుతూ కన్నవారికి తీరని శోకం మిగుల్చుతున్నారు పలువురు విద్యార్థులు. పోటీతత్వం పెరిగిపోవడం.. ఉత్తమ మార్కుల కోసం తల్లిదండ్రుల ఒత్తిడి ఓ వైపు.. కాలేజీ యాజమాన్యాల ఒత్తిడి మరోవైపు వారి ప్రాణాలపైకి తెస్తోంది. పరీక్షల్లో ఉత్తీర్ణులు కాకపోవడంతో జీవితంలోనూ ఫెయిల్ అయితానేమో భావన వారిలో ఆత్మహత్యలకు పాల్పడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. ఈనెల 15 నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పదో తరగతి పరీక్షలు ఏప్రిల్ 3 నుంచి షురూ కానున్నాయి. పరీక్షలంటే భయం లేకుండా ఆత్మవిశ్వాసంతో అనుకూల దృక్పథంతో చదివితే పరీక్షల్లో విజయం సాధించవచ్చంటున్నారు నిపుణులు.

ప్రణాళికాబద్ధంగా చదివితే.. విద్యార్థులు పాఠ్యంశాలు అర్థం కాక మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. సమయానికి సిలబస్ మొత్తాన్ని చదువులేక..అందోళన చెందుతుంటారు. నిద్రలేమి రాత్రులు..గడపటమే కాకుండా సరైన సమయానికి ఆహారం తీసుకోకపోవడం విద్యార్థుల్లో చూస్తుంటాం. ఇలాంటి పరిస్థితుల్లో సమయపాలన పాటిస్తూ ప్రణాళికాబద్ధంగా చదివితే పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించడం కష్టమేమి కాదంటున్నారు నిపుణులు. అర్థం కాని పాఠాలను క్షుణ్ణంగా రెండు, మూడు సార్లు చదవాలని సూచిస్తున్నారు. సందేహాలుంటే ఎప్పటికప్పుడు ఉపాధ్యాయులను, తోటి స్నేహితుల సహకారం తీసుకుంటే మంచిదని చెబుతున్నారు.

ప్రణాళికాబద్ధంగా చదవాలి



ఇతరులతో పోటీ పడడం తోనే విద్యార్థులు ఎక్కువగా ఒత్తిడికి గురవుతున్నారు. చదువు విషయంలో ప్రణాళిక, సమయపాలన ముఖ్యం. కష్టమైన సబ్జెక్టు ఉంటే ప్రతిరోజు వారు చదివేలా తల్లిదండ్రులు శ్రద్ధ చూపాలి. కష్టమని పక్కకు పెడితే పరీక్షల సమయానికి ఇబ్బంది తప్పదు. వారి మెదడుకు మేత వేయాలి. సెల్‌ఫోన్, టీవీలకు దూరంగా ఉంచాలి. చదువుపై ప్రణాళికబద్ధమైన అలవాటు చేయాలి.

– మహ్మద్ సద్దాం, పీహెచ్‌సీ వైద్యాధికారి, నేరడిగొండ

ఒత్తిడి, మానసిక సమస్యల పరిష్కారంపై అవగాహన



పరీక్ష ఫలితంతో సంబంధం లేకుండా విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు భరోసా కల్పించాలి. యోగా, ధ్యానం, వ్యాయామం అలవాటు చేసుకోవాలి. విద్యార్థుల్లో పపరీక్షల ఒత్తిడి, ఇతర మానసిక సమస్యలు పరిష్కరించుకునేందుకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో టెలీ–మానస్ పేరిట 14416 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. స్కూల్ మెంటల్ హెల్త్, నేషనల్ టుబాకో కంట్రోల్ ప్రోగ్రాం ద్వారా అవగాహన కల్పించేందుకు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శిక్షణ నిర్వహించాం. కళాశాలలు, పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు. ఫిబ్రవరి 28 నుంచి కార్యక్రమం మొదలైంది. అందుబాటులో సైకియాట్రిస్టులు కౌన్సెలింగ్ ద్వారా విద్యార్థులకు తగిన పరిష్కారాలను సూచిస్తారు.

– డా.సునీల్ కుమార్, మానసిక వైద్యనిపుణులు, మంచిర్యాల

మానసిక ఉల్లాసానికి సమయం



విద్యార్థులు ఏరోజు పాఠశాలను ఆ రోజే చదువుకుంటే ఒత్తిడి తగ్గుతుంది. తమపై తమకు నమ్మకం పెరగడానికి దోహదపడుతుంది. ఒక్కొక్కరిలో ఒక్కోస్థాయి సామర్థ్యం ఉంటుంది. అంతకుమించి ఆయా కళాశాలల యజమాన్యాలు, తల్లిదండ్రుల ఆశించడంతో ఒత్తిడికి గురవుతుంటారు. ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఇంటర్ బోర్డు టైం టేబుల్ కాకుండా తరగతులు నిర్వహించడం ఒత్తిడికి లోనవుతున్నారు. ఆయా కళాశాలలు చదువుతో పాటు మానసిక ఉల్లాసానికి కూడా తగిన సమయం కేటాయించాలి. – లక్ష్మణ్‌రావు, అధ్యాపకుడు

మానసిక ధైర్యం చెప్పాలి



తల్లిదండ్రులు పిల్లలకు మానసిక ధైర్యం చెప్పకపోతే భవిష్యత్‌లో ఎదురయ్యే కఠిన పరీక్షలను ఎదుర్కోలేరు. విద్యార్థులు పరీక్షలంటే భయం పడాల్సిన అవసరం లేదు. మార్కులు జీవితానికి ప్రమాణికంగా కాకుండా వారిని ప్రోత్సహించే విధానాలు తెలుసుకుని మానసికంగా బలవంతుల్ని చేయాలి. విద్యార్థుల శ్రేయస్సు దృష్ట్యా ప్రభుత్వం కరోనా తర్వాత పరీక్షలను సులభతరం చేసింది. ఒత్తిళ్లను దూరం చేసేలా చర్యలు చేపట్టింది. పదకొండు పేపర్లకు బదులుగా ఆరు పేపర్లుగా మార్చుతూ నిర్ణయం తీసుకుంది. పాఠ్యాంశాలు అర్థం చేసుకోని చదువుకోవాలి.

– ఎస్.వెంకటేశ్వర్లు డీఈవో

భయం వీడితే జయం



విద్యార్థులకు పరీక్షల సమయంలో సరైన నిద్ర అవసరం. రాత్రంతా పుస్తకాలతో కుస్తీ పట్టడంతో ప్రయోజనం తక్కువే. కనీసం ఆరు గంటల నిద్ర అవసరం. నిద్రపోకుండా చదవటం వల్ల మానసిక ఒత్తిడికి గురవుతుంటారు. ఆరోగ్యం క్షీణిస్తోంది. పోషక విలువలు కల్గిన ఆహారంతో పాటు నీటిని ఎక్కువగా తాగాలి. ప్రతి సబ్జెక్టు క్షుణ్ణంగా చదవాలి. అవగాహనతో అర్థం చేసుకుంటూ చదవాలి. ఆత్మవిశ్వాసం, సమయపాలనతో పాటు ప్రణాళికబద్ధంగా చదవటం అలవర్చుకుంటే లక్ష్యాన్ని చేరుకోవటం సులువే.

– అంబాల సమ్మయ్య, కౌన్సెలింగ్, సైకాలజిస్టు

ఆత్మీయ వేదికలుగా..



మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు, మాజీ ఎంపీ వివేక్‌లకు సన్మానిస్తున్న నాయకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): వేంపల్లి శివారులో గల పద్మావతి గార్డెన్‌లో బీజేపీ సీనియర్ నాయకుడు గోనె భాగ్యలక్ష్మి–శ్యాంసుందర్‌రావు దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సమ్మేళనం ఆహుతులతో కళకళలాడింది. ఆత్మీయ సమ్మేళనం లాంటి కార్యక్రమాలు అందరి కలయికతో సంతోషాలకు వేదికలుగా మారుతాయని వక్తలు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, మాజీ ఎంపీ వివేక్‌లను సన్మానించారు. మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్, బీజేపీ బెల్లంపల్లి అసెంబ్లీ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ, ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్ రామచంద్రయ్య, ఏకలవ్య ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పులగం తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

జాతీయ ఉత్తమ రైతుగా సుగుణ



అవార్డు అందిస్తున్న కేంద్ర మంత్రులు

దండేపల్లి(మంచిర్యాల): మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం నాగసముద్రం గ్రామానికి చెందిన మహిళా రైతు నందుర్క సుగుణ సేంద్రియ సాగుచేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తూ, జాతీయ అవార్డు సొంతం చేసుకుంది. భారత వ్యవసాయ పరిశోధన సంస్థ(ఐసీఏఆర్) న్యూఢిల్లీ వారు ప్రకటించిన జాతీయ ఉత్తమ రైతు అవార్డుకు సుగుణ ఎంపిక కాగా ఢిల్లీలో నరేంద్రసింగ్ తోమర్, కైలాస్‌చౌదరి, శోభకరందాజే, డాక్టర్ హిమాన్షుపాటక్ చేతుల మీదుగా ఆదివారం అవార్డు అందుకుంది. తనకు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని, అవార్డు రావడానికి కృషిచేసిన బెల్లంపల్లి కృషి విజ్ఞాన సంస్థ వారికి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రశాంతంగా ‘గురుకుల’ యూజీ సెట్



పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న సీవోఈ ప్రిన్సిపాల్ సైదులు, ఎస్సై రాజశేఖర్

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకులాల్లోని డిగ్రీ కళాశాలల్లో ఆదివారం అండర్ గ్రాడ్యుయేట్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (యూజీ సెట్–2023) ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఆదిలాబాద్ రీజియన్ పరి ధిలో ఆరు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్ష మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగింది. మొత్తం 2,207 మందికి గాను 2,023 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మరో 184 మంది గైర్హాజరయ్యారు. మొత్తం విద్యార్థుల హాజరు 91.66 శాతంగా నమోదైనట్లు గురుకులాల విద్యాలయాల సంస్థ ఆదిలాబాద్ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ప్రకటించారు.

పరీక్ష కేంద్రాల వారీగా..

ఆదిలాబాద్ (సీవోఈ బాలికల గురుకుల కళాశాల) పరీక్ష కేంద్రంలో 490 మంది విద్యార్థులకుగాను 450 మంది హాజరయ్యారు. 40 మంది గైర్హాజరయ్యారు. ఇచ్చోడ (బాలికల డిగ్రీ కళాశాల) పరీక్ష కేంద్రంలో 337 మందికి 303 మంది విద్యార్థులు హాజరై పరీక్ష రాశారు. మరో 34 మంది హాజరుకాలేదు. సిర్పూర్ (టి)(బాలికల గురుకుల కళాశాల) లో 333 మందికి 304 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 29 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. సిర్పూర్ (టి) (బాలుర గురుకుల కళాశాల)లో 347 మంది విద్యార్థులకు 315 మంది పరీక్ష రాశారు. మరో 32 మంది గైర్హాజరయ్యారు. బెల్లంపల్లి (సీవోఈ బాలుర గురుకుల కళాశాల)లో 219 మందికి 209 మంది పరీక్షకు హాజరయ్యారు.10 మంది విద్యార్థులు డుమ్మా కొట్టారు. బెల్లంపల్లి (సంక్షేమ బాలికల గురుకుల కళాశాల)లో 481 మంది విద్యార్థులకు గాను 442 మంది పరీక్ష రాశారు. మిగిలిన 39 మంది విద్యార్థులు వివిధ కారణాలతో పరీక్షకు దూరంగా ఉండి పోయారు. యూజీ సెట్ పరీక్ష నిర్వహణను ఆర్‌సీవో స్వరూపరాణి పర్యవేక్షించారు. బెల్లంపల్లిలోని పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా ప్రభుత్వాల పాలన

- సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.నిరూప్



మాట్లాడుతున్న సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.నిరూప్

పాతమంచిర్యాల: ప్రజాస్వామ్యానికి విరుద్ధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పాలన కొనసాగుతోందని సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది పి.నిరూప్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కరుణాకర్ దేశాయి అన్నారు. జిల్లాకేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో ఆదివారం ప్రజాస్వామికవాదుల సదస్సు నిర్వహించారు. ‘వెంటిలేటర్’పై ప్రజాస్వామ్యం అనే అంశంపై వారు మాట్లాడారు. ప్రభుత్వాలను ప్రశ్నిస్తే జైల్లో పెట్టే పరిస్థితులు ఉన్నాయన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 280 గ్రామాల్లోని 4 లక్షల కుటుంబాలు నిర్వాసితులవుతుంటే ప్రశ్నించే వారు కరువయ్యారని అన్నారు. ప్రజా సమస్యలు చెబుదామంటే ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌తో భూములు ఎవరికి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి నెలకొందన్నారు. దేశంలో మనువాద సంస్కృతి చాపకింద నీరులా వ్యాపిస్తోందన్నారు. పౌరసమాజం మెల్కోని ప్రజలను చైతన్యం తేవాలన్నారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండళి కళాకారులు సమ్మయ్య ఆలపించిన తెలంగాణ గీతం పలువురిని ఆకట్టుకుంది. కార్యక్రమ అనంతరం పలుసంఘాల నాయకులు ముఖ్య వక్తలకు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నీలకంతేశ్వర్‌రావు, ప్రజాసంఘాల నాయకులు అన్వర్, జైపాల్‌సింగ్, దేవిసత్యం, శ్రీమన్నారాయణ, సామాజిక న్యాయవేదిక జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, బహుజన సంఘాల నాయకులు పలిగిరి కనకరాజు, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలలో రక్షా హోమ్ బుకింగ్స్ ప్రారంభం



రక్షా హోమ్ అపార్ట్‌మెంట్



ప్రారంభోత్సవంలో పాల్గొన్న కైలాస్ శ్రీనివాస్

మంచిర్యాలటౌన్: జిల్లాకేంద్రంలో అన్నిహంగులతో నిర్మించిన గేటెడ్ కమ్యూనిటీ రక్షా హోమ్స్‌ను ఆదివారం రక్షా కన్‌స్ట్రక్షన్స్ డెవలపర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కైలాస్ శ్రీనివాస్ పూజా కార్యక్రమాన్ని నిర్వహించి బుకింగ్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయిలో మొదటిసారిగా మంచిర్యాలలోని ఏసీసీలో రక్షా హోమ్స్‌ను నిర్మించామని తెలిపారు. 60 బ్లాక్‌లు నిర్మించగా, స్విమ్మింగ్‌పూల్, లేడీస్ జెంట్స్ క్లబ్, చిల్డ్రన్స్ పార్కు, ఇండోర్ గేమ్స్ ఏర్పాటు చేశామన్నారు. విశాలమైన వెయిటింగ్ హాల్, పార్కింగ్ స్థలాలు ఈ అపార్టుమెంట్‌కు ఉన్నాయన్నారు.

అ‘పూర్వ’ సమ్మేళనం



మంచిర్యాల జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న విద్యార్థులు


మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో 1979–80 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ‘పూర్వ’ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం స్థానిక వీ కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఒకరికొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. 42 ఏళ్ల అనంతరం ఏర్పాటు చేసుకున్న ఆత్మీయ సమ్మేళనంలో భాగంగా మృతి చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల పీఈటీ మల్లారెడ్డిని సన్మానించిన అనంతరం పూర్వ విద్యార్థి విజయ్‌కుమార్ ఆర్వో వాటర్ యూనిట్‌ను పాఠశాలకు అందిస్తున్నట్లు ప్రకటించారు.

నెన్నెల: మండలంలోని అవుడం జెడ్పీ ఉన్నతపాఠశాల పదో తరగతి 2003–04 బ్యాచ్ పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తర్వాత కలుసుకున్నారు. రోజంతా సంతోషంగా గడిపారు. మిత్రులంతా అందరి చిరునామాలు సేకరించి చిన్ననాటి చెల్మి పేరుతో వాట్సప్ గ్రూప్ చేశారు. చదువు చెప్పిన ఉపాధ్యాయులు శ్రీధర్‌రెడ్డి, శ్రీమూర్తి, రాజన్నలను సన్మానించారు. ఎంపీపీ రామదేవి, పూర్వ విద్యార్థులు, సున్నంరాజు, రాజేశం, రామరాజు, బింగి పావణి, లావణ్య, రాజేందర్, బీఆర్‌ఎస్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, చీర్ల మొండన్న పాల్గొన్నారు.

ప్రశాంతంగా సీవోఈ సెట్

పరీక్ష కేంద్రాల వారీగా..

పరీక్ష కేంద్రం	అలాట్‌మెంట్‌విద్యార్థులు	హాజరు	గైర్హాజరు
ఆదిలాబాద్ (బాలికలు)	648	614	34
బోథ్ బాలికలు	648	612	36
ఇచ్చోడ (బాలురు)	312	295	17
ఇచ్చోడ డిగ్రీ కళాశాల	312	295	17
ఆసిఫాబాద్ (బాలురు)	528	487	41
సిర్పూర్(టి) (బాలురు)	511	483	28
సిర్పూట్(టి) (బాలికలు)	528	501	27
రెబ్బెన (బాలికలు)	159	148	11
బెల్లంపల్లి (సీవోఈ)	504	476	28
బెల్లంపల్లి (బాలికలు)	493	473	20
కాసిపేట (బాలురు)	379	356	23
లక్సెట్టిపేట (బాలికలు)	545	522	23
చెన్నూర్ (బాలికలు)	576	554	22
జైపూర్ (బాలురు)	576	549	27



కాసిపేట బాలుర పరీక్షకేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్‌సీవో స్వరూపరాణి

బెల్లంపల్లి: ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్సీ (సీవోఈ) కళాశాలల్లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించిన సీవోఈ సెట్–2023 ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తం 6,719 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో 6,365 మంది హాజరై పరీక్ష రాశారు. మరో 354 మంది డుమ్మా కొట్టారు. మొత్తంగా విద్యార్థుల హాజరు 94.74 శాతంగా నమోదైనట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కోఆర్డినేటర్ కొప్పుల స్వరూపరాణి ప్రకటించారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1 గంటతో ముగిసింది. ఉదయం 9 గంటల వరకే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు. తల్లిదండ్రులు, తోబుట్టువులతో కలిసి వచ్చారు. ఆయా కేంద్రాల ముఖద్వారం వద్ద వారిని పరిశీలించిన తర్వాత లోనికి అనుమతించారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పరీక్ష కేంద్రాలు పరిశీలించిన ఆర్‌సీవో

బెల్లంపల్లిలోని కాసిపేట బాలుర గురుకుల కళాశాల, ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని రెబ్బెన పరీక్ష కేందాలను ఆర్‌సీఓ స్వరూపరాణి పర్యవేక్షించారు. పరీక్షల్లో ఎలాంటి తప్పులు దొర్లకుండా ఎప్పటికప్పుడు ఆమె పర్యవేక్షించి చీఫ్ సూపరింటెండెంట్లకు మార్గదర్శకం చేశారు. బెల్లంపల్లి సీవోఈ కళాశాల, కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల కళాశాల, బాలికల గురుకుల కళాశాల పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు ఐనాల సైదులు, ఊటూరి సంతోష్, స్వరూపలు పటిష్ట చర్యలు తీసుకున్నారు. డిపార్ట్ మెంటల్ అధికారులుగా పూర్ణిమ, స్వప్న వ్యవహరించగా, రూట్ అధికారిగా కోటిచింతల మహేశ్వరరావు ఆనందరెడ్డి పనిచేశారు.

సారంగపూర్: జామ్ సాంఘిక సంక్షేమ శాఖ బాలికల గురుకుల విద్యాలయంలో సీవోఈ ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 455 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా ఇందులో 435 మంది హాజరు కాగా మరో 25 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ రమాకళ్యాణి తెలిపారు.